ఎంతగానో ప్రేమించిన అతనికి భార్య అయికూడా దూరంగా ఎందుకు బ్రతకాలనుకుంది?

# ప్రేమంటే?


చంద్రమోహన్ కథ

"నన్నెందుకు ప్రేమిస్తున్నారు?" సాధన అడిగిన ప్రశ్నకు కలవరపడ్డాడు మోహన్. ఆమెను ప్రేమిస్తున్నమాట నిజం. కాని ఎందుకు ప్రేమిస్తున్నాడన్నది అతను ఏ రోజూ ఆలోచించలేదు.

రెండేళ్ల క్రిందట సిటీ బస్సులో వెనుక సీట్లో కూర్చుని నేలచూపులు చూస్తూ ఏదో ఆలోచిస్తున్న అతని దృష్టి తన ముందు నిల్చున్న అమ్మాయి పాదాలపై పడింది. అతని ప్రమేయంలేకుండానే అతని చూపులు ఆమె పాదాలనుంచి ప్రతి అణువునూ స్పృశిస్తూ తలెత్తి ఆమె కళ్లలోకి చూశాయి. ఆ కళ్లు తనవైపే చూస్తున్నాయి. అంతే! అతను మరిక చూపు మరల్చుకోలేకపోయాడు. ఆ కళ్లలోంచి ఏదో శక్తి అమృతధారలా తన కళ్లలోకి ప్రసరించి అతని శరీరంలోని ప్రతి అణువునూ ఉత్తేజవంతమూ, శక్తివంతమూ చేసింది. ఆ తర్వాత ఆమె నవ్వింది. ఆ నవ్వుత అతని హృదయంలోని ప్రతి చీకటి మూలనూ వెలుగు నింపి మనసును తేజోవంతం చేసింది. ఆ మనోహరమైన చూపుల్నుంచి, నవ్వునుంచి తప్పుకుని అతను బ్రతకలేనంత పిచ్చివాడైపోయాడు.

మగాడు ఆకర్షణలో పడడానికి ఆడది జగదేక సుందరి కానక్కరలేదు. ఏ కంటి చూపో, నవ్వో, ఏ నడుము వంపో మరి ఏ కులుకో మగాడ్ని పిచ్చివాడ్నిచేసి దీపం చుట్టూ తిరిగే పురుగుమాదిరిగా మార్చగలుగుతుంది.

ఆరోజు తర్వాత రెండేళ్లు ఆమెకోసం తపిస్తే ఈరోజు మొదటిసారిగా తనంతట తానే అతనిని పిలిచి అడిగింది. 'నన్నెందుకు



ప్రేమిస్తున్నారు?' అని.

అసలది ప్రేమో, మోహమో లేక ఆకర్షణో అతనికి తెలీదు. ఆమెగూర్చికూడా అతనికి ఏమీ తెలీదు — తన కళ్లకు కనబడే ఆమె అందం తప్ప, ఆ చూపులు, ఆ నవ్వు తప్ప.

''మిమ్మల్నే! మాట్లాడరేం?'' ఆమె రెట్టించడంతో ఆలోచనలనుంచి తేరుకుని

నెమ్మదిగా అన్నాడతను.

"మీ అందం చూసి మిమ్మల్ని ప్రేమిస్తున్నాను" అని.

దానికి ఆమె మనోహరంగా నవ్వి "అది ప్రేమకాదు, ఆకర్షణ. నా అందం ఇలా విరిచి వున్నంతవరకే మీరు నన్ను ప్రేమిస్తారు. అసలు నేనేగనక అందంగా లేకపోతే మీరు నావైపు కన్నెత్తైనా చూసేవారా? చూడండి మోహన్! నా దృష్టిలో అసలు ప్రేమనేది లేదు. అంతా ట్రాష్! కాబట్టి నన్ను మర్చిపోండి. ప్లీజ్! ఇకనుంచి నావెంట పడొద్దు" అనేసి వెళ్లిపోయింది. అతను బ్లాంక్‌గా ఆమె వెళ్లినవైపు చూస్తూ నిల్చుండిపోయాడు.

◇ ◆ ◇

మరో రెండేళ్ల తర్వాత వారిద్దరికీ పెళ్లయింది. ఎలా అయిందన్నది ఆలోచించ నక్కరలేదు. ఈ సమాజంలో జరిగే పెళ్లిళ్లకు వారిద్దరి మనసులూ కలవకపోయినా ఫరవాలేదు. వాళ్ల అభిప్రాయాలు ఒక్కటి కానవసరంలేదు. ఒకళ్లమీద ఒకరికి ప్రేమా, మోహమూ, ఆకర్షణా అనేవి వుండనక్కరలేదు. కులాలు కలిస్తే చాలు. స్టేటస్‌లూ, కట్నకానుకలు తూగితే చాలు. ఈ సమాజంలో ఒక అమ్మాయి ఒక అబ్బాయి మొదటిరాత్రి జరుపుకోవచ్చు. కలిసి కాపురం చెయ్యొచ్చు ఒకే కప్పుకింద కీచులాడుకుంటూ, కసురుకుంటూ దాంపత్యం పేరుతో.

◇ ◆ ◇

పెళ్లయిన రెండేళ్లకు...

ఆమె మోకాళ్లమీద తన మోచేతిని ఆన్చి, తలెత్తి ఆమె కళ్లలోకి చూస్తూ... ఆమె తన చేతివ్రేళ్లను అతని జుట్టులోనికి జొనిపి వెంట్రుకలను మెలిపెడుతూ... పెరట్లో నైట్ క్వీన్ పరిమళాలను ఆస్వాదిస్తూ, వెన్నెల్లో...

'రేపు బిర్లా మందిర్‌కు పోదామా?' అన్నాడతను. ఆమె పకాలున నవ్వింది. అతను అలా నవ్వుతున్న ఆమెను పిచ్చిగా, ఆరాధనగా చూస్తున్నాడు. ఆమెను చూసిన మొదటిరోజునుంచీ ఈరోజువరకూ కూడా ఆమె అలా నవ్వితే అతను పిచ్చివాడైపోతాడు. ఆమె నవ్వడం ఆపింది.

"ఎందుకు అలానవ్వావ్" అడిగాడతను.

"నవ్వురాదూ? దేవుడిమీద నమ్మకంలేని మీరు గుడికి వెళదాం అంటూంటే" అంది.

"నేను గుడికి వెళదాం అన్నది దేవుడ్ని చూడ్డానికి కాదు"

"మరి?!" ఆశ్చర్యపోయింది ఆమె.

"రేపు పౌర్ణమి. ఆ అందమైన పాలరాతి మందిరంలో ఆ వెన్నెల్లో రేపు రాత్రి, తలారా స్నానంచేసి జారు ముడేసి, తలలో కనకాంబరాలు తురిమి, పట్టుచీరెలో బంగారు ఛాయలో నీ శరీరం ఆ మెర్క్యూరీ దీపాలలో ఒకసారి దేవతలా, ఆ సోడియం ల్యాంపుల్లో ఒకసారి అప్సరలా, సహజసిద్ధమైన వెన్నెల్లో ఒకసారి రతిలా కనిపించే నిన్ను చూడాలనీ, రాత్రివేళల్లో వీచే చల్లటి ఆహ్లాదకరమైన గాలిలో చెదిరి నీ మొహంపైన ఊయలలూగే ముంగురుల వెనుకనుంచి నీ మోమును చెట్టు ఆకుల సందుల్లోంచి జాబిలిని చూస్తున్నట్టుగా చూడాలని"

"ఛీ! దేవుడి గుళ్లోకూడా ఆ పాడుబుద్ధే!" అందామె.

"కనబడని దేవుడికోసం రాతి విగ్రహాల్లోనూ, గుళ్లలోనూ, చెట్టూ పుట్టల్లోనూ వెదికేకంటే కనబడే అందాల్ని నీలో వెదకడం తప్పా? అయినా నువ్వు కనబడేటప్పుడు నేను పొందే అనుభూతి, ఆనందం నా మనసుకు కలిగే ఊరట ఇవేవీ నాకు ఆ దేవుడు ప్రత్యక్షం అయినా కలగవు. నీలోని అందాల్ని విశ్వంలోని ప్రతి అణువుకూ పూసి విశ్వమంతా పెద్ద చిత్రాన్ని చేసి నిన్ను ఆరాధిస్తున్నాను. నా చూపు ప్రసరించినంత మేర నీ అందమే, నా మనసు ఆలోచించినంతమేర నువ్వే. రోజుకు ఎనిమిది గంటలు ఆ ల్యాబ్‌లో ఇన్‌ఛార్జిగా ఉద్యోగం చెయ్యవల్సి లేకపోతే, తిండీ, నిద్రా ఇలాంటి పాడు వికారాలు ఈ వంటికి లేకపోతే ఇలా ఇరవై నాలుగ్గంటలూ నీ కళ్లలోకి చూస్తూ, నీ శరీరాన్ని తాకుతూ వుండిపోయేవాడిని యుగాలకొలదీ, ఈ ఆత్మ నిలిచి వున్నంతవరకూ. నీ మొహాన్ని చూసినప్పుడు ఏమనిపిస్తుందో తెలుసా! ముద్దుపెట్టుకుని నీ మొహం మీది అందాన్నంతా జుర్రుకోవాలనిపిస్తుంది. తీవ్రమైన, దీర్ఘమైన ముద్దు తర్వాత, పెదవులు విడివడిన తర్వాత మళ్లీ నీ మొహంలోకి చూస్తే అదే అందం. మళ్లీ అదే కోరిక. చివరికి ఆ కోర్కె తీరకుండానే ఈ ప్రాణం పోతుందేమో అనిపిస్తుంది."

చప్పున అతని నోటికి చేతిని అడ్డంపెట్టి అతని తలను తన రొమ్ములకేసి అదుముకుందామె.

◇ ◆ ◇

మరో ఆరు నెలల తర్వాత...

ల్యాబరేటరీ పనిమీద ఏదో యాసిడ్ బాటిల్‌ను బజారునుంచి తెచ్చి ఇంట్లో మర్చిపోయి, ఆఫీసుకు వెళ్లిపోయాడు మోహన్. ఇల్లు శుభ్రం చేస్తూ ఆ బాటిల్‌ను అటకపై పెట్టబోయింది సాధన. అంతలో అది చేయిజారి అటకపైనుంచి ఆసిడ్ ఆమె మొహంమీదా, వంటిమీదా పడింది. మొహ

## క్రేజీ అమెరికా



అమెరికా... ప్రపంచానికే ఓ క్రేజ్! అందుకే ప్రతి సంవత్సరం వివిధ దేశాలనుంచి ఆ దేశానికి చాలామంది వలసవెళ్తున్నారు. ఈ విషయంలో మెక్సికో మొదటిస్థానంలో వుంది. ఆ దేశంనుంచి ప్రతి సంవత్సరం తొంభైవేలమంది అమెరికా వెళ్తున్నారు. రెండో స్థానం 77 వేలతో వియత్నాం, 59 వేలతో ఫిలిప్పైన్స్ మూడవ స్థానాన్ని ఆక్రమిస్తున్నాయి. మన దేశంనుంచి ప్రతిఏటా దాదాపు 35వేలమందిదాకా అమెరికా వెళ్తున్నారు. చైనా, రష్యాలనుంచికూడా దాదాపు 40 వేలమందిదాకా వెళ్తున్నారు! మరి ఇలా అందరూ అమెరికా వెళ్తే... కొన్నాళ్లకు అదో ఇండియానో, చైనాగానో మారవచ్చునేమో?!

— జూపిటర్

మూ, భుజాలూ బాగా గాయపడడంతో ఆమెను హాస్పిటల్‌లో చేర్చారు ఇరుగూ పొరుగూ. ఆరోజునుంచి రెండు నెలలు ఆమె అక్కడే వుండవలసివచ్చింది. ఆ రెండు నెలలూ రాత్రీ పగలూ ఆమె దగ్గరే వుండి ఆమెకు సేవలు చేశాడు మోహన్.

హాస్పిటల్‌నుంచి ఇంటికి వచ్చింది సాధన. ఆమెను ఇంటిదగ్గర దించి ఆఫీసుకు వెళ్లాడు మోహన్. ఇపుడామె పూర్తిగా కోలుకుంది. ఒళ్లంతా చిరాగ్గా వుండడంతో మొహం కడుక్కుందామని వెళుతూ అద్దంలో మొహం చూసుకుంది. ఒక్కసారిగా ఒళ్లు జలదరించింది. శరీరం నేలలో కూరుకుపోతున్నట్టనిపించింది. సర్వం కోల్పోయినట్టయి దుఃఖం ఆపుకోలేక ఏడ్చింది. అంతే కాదు. రకరకాలుగా ఆలోచించింది.

మధ్యాహ్నం మోహన్‌కు ఫోనుచేసింది. అప్పటికప్పుడు మోహన్ ఇంటికి రాకమునుపే తన పుట్టింటికి వెళ్లిపోయింది. ఇంత అర్జంటుగా తనుఎందుకు వెళ్లవలసివచ్చిందో అర్థంకాకపోయినా ఆమెకూ కాస్తంత రిలీఫ్‌గా వుంటుందని ఊరుకున్నాడు మోహన్.

రెండునెలలు గడిచాయి. రెండుమూడు రోజులకొకసారి అతను ఫోన్ చేస్తూనే వున్నాడు. దాదాపు పది ప్రేమలేఖలు వ్రాసి వుంటాడు. కానీ వాటికి జవాబు రాలేదు. ఆరోజు అతనికి భార్య దగ్గర్నుంచి డైవర్స్ ప్రపోజల్ లెటర్ వచ్చింది. అది చదివి స్థాణువైపోయాడతను. జరుగుతున్నదేమిటో అర్థం చేసుకోలేని పరిస్థితిలో ఆమె దగ్గరకు పరుగెత్తాడు.

''సాధనా! ఏమిటిదంతా? అసలేం జరిగింది?'' అడిగాడతను.

''నేను విడాకులు తీసుకోవాలనుకుంటున్నాను'' అంది సాధన.

''అదే ఎందుకు? ఎందుకీ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది''

''కారణం చెప్పదలచుకోలేదు. ప్లీజ్! నన్నేమీ అడగకండి!''

''నాకు కాకపోయినా రేపు కోర్టుకైనా కారణం తెలియాలి''

''నేను కోర్టువరకూ వెళ్లదలచుకోలేదు. మిమ్మల్నే అడుగుతున్నాను. నన్ను ఇలాగే ఇక్కడ బ్రతకనివ్వండి'' అతనికేమీ అర్థంకాలేదు.

''సాధనా! నావల్ల ఏదైనా కష్టం కలిగిందా లేక నాలో ఏదైనా లోపం వుందా? నా సాహచర్యం నీకు నచ్చలేదా? ఏమిటి? ఏమిటి కారణం. నువ్వు ఏదో దాస్తున్నావు. నా దగ్గర దాపరికం ఏమిటి చెప్పు! నన్ను పరాయివాడ్ని చెయ్యకు సాధనా! ప్లీజ్! నువ్వు లేకపోతే నేను బ్రతకలేను'' ఆవేదనగా అడుగుతున్న అతని ముఖంలోకి చూసేసరికి ఒక్కసారిగా ఏడుపు తన్నుకొచ్చింది ఆమెకు. ముఖానికి చేతులు అడ్డుపెట్టుకుని ఏడ్చింది కాసేపు.

అతని హృదయం విలవిలలాడింది ఆమెనా స్థితిలో చూసి. ఆమె శరీరం బాగా చిక్కింది. ఏదో బాధతో ఆమె కృంగిపోతున్నట్లనిపించింది. కాసేపటికి తర్వాత అతను మళ్లీ రెట్టించడంతో ఆమె అంది.

''ఇన్నాళ్లూ మీరు నా అందాన్ని ఆరాధించారు. అందువల్లే నన్నంతగా ప్రేమించారు కూడా. కానీ ఇపుడు ఆ అందం నా దగ్గర

లేదు. అలాగని మీరు నన్ను వదులుకుంటారని కాదు. ఇకనుంచి మీకు నామీద ప్రేమకు బదులుగా సానుభూతి మాత్రమే వుంటుంది. మోహానికి బదులుగా కర్తవ్యం మాత్రమే వుంటుంది. ఇన్నాళ్లూ మీచేత ఆరాధించబడి మీ సమక్షంలో ఒక అపురూపమైన వస్తువులా వుండి ఈరోజు మీరు నా పట్ల జాలిని చూపించడం నేను సహించలేనండీ. అందుకే మీకు దూరంగా వుండదలచుకున్నాను" నిశ్చయంగా అందామె.

"నన్ను వదలి నువ్వుండగలవా?" నెమ్మదిగా అన్నాడతను.

"వుండలేను. కాని వుండాలని తీర్మానించుకున్నాను"

"సరే నీ ఇష్టం. కానీ నేను చెప్పేది కూడా విను. నువ్వు లేకపోతే నేను బ్రతకలేనని కాదు. కానీ నా జీవితం సంపూర్ణంగా గడవదు. ఏదో వెలితి. నా మనసులోనూ, నా జీవితంలోనూ వుంటుంది. నువ్వు నా సమక్షంలో లేని ప్రతిక్షణమూ నాకు నరకప్రాయం. ఇన్నాళ్లూ ఈ ప్రపంచంలోనాకు నువ్వుతప్ప ఎవరూ లేరనీ, అక్కరలేదనీ అనుకున్నాను. ఇకపై నేను ఒంటరివాడ్నవుతాను. నా జీవితంలోని ఏ ఆనందమూ, సుఖమూ, కోరికా నీతో పంచుకోకపోతే వాటికి ఆ విలువ వుండదు. నాకు బాధకలిగినప్పుడు నీ ఒళ్లోనే తలపెట్టుకుని నీ ఓదార్పులోనే ఉపశమనం పొందే ఆ బాధలోని ఆనందం నేను పొందలేను. సాధనా! వికారం నీ ముఖానికేగాని, నీ మనసుకూ, ఆత్మకూ ఇంకా అంటలేదు. ఆకర్షణా, మోహమో అంతమయ్యేచోటునుంచే ప్రేమ మొదలవుతుంది. ప్రేమంటే ఆత్మల సంయోగం. నువ్వు నా సమక్షంలో లేకపోయినా ఈ ఆరాధన, నీపై ప్రేమ అనేవి నా ఆత్మ ఈ శరీరంలో వున్నంతవరకూ వుంటుంది. ఇక నీ ఇష్టం. నా జీవితం నీ నిర్ణయంపై ఆధారపడి వుంది. నువ్వెప్పుడు రావాలనుకున్నా నా ఇంటితోపాటు హృదయద్వారంగూడా నీకు స్వాగతం పలుకుతుంది. వెళ్తాను" అని చకచకా బయటకు వెళ్లిపోయాడు.

అనిర్వచనీయమైన అనుభూతితో, ఆర్తితో, ఆనందంతో ఆమె ఉక్కిరిబిక్కిరి అయ్యింది. వెంటనే అతని వెనుకనే తన ఇంటికి, తన భర్తకోసం ఆమె ప్రయాణం అయింది.

◇ ◆ ◇

